# సుడిగాడు!

దేనికైనా సుడివుండాలి!. అది లేకపోతే ఇంతే సంగతులు! ఎదగలేరు... వృద్ధిలోకి రావటం అసంభవం! కాకపోతే సుడితోపాటు కృషికూడా మనిషి ఎదుగుదలకు ఎంతైనా అవసరం!. అదినాకు అనుభవేకవైద్యం.

సహజంగ... అందరి నెత్తిన ఒక్క 'సుడే' వుంటుంది. కొదరికి రెండు సుళ్లు వుండటంకద్దు! రెండు సుడులు నెత్తిన వున్న పిల్లలను ఒరే వీడికి ఇద్దరు పెళ్లాలొస్తారోయ్... అంటూ పెద్దచిన్నా ఏడిపిస్తూంటారు.

మూడు సుడులున్నవారు 'రేర్'గ తారసపడతారు. మూడు వున్నవాడు లక్కీఫెలో! పట్టింది బంగారం! లైఫ్‌లో వీడికి ఎందురుండదు. సుడిగాలిలా అన్నిరంగాల్లోనూ దూసుకుపోయి అందలం ఎక్కేస్తారు.

పశువుల విషయంలోనూ సుడులు చూచే ధర నిర్ణయం జరుగుతుందంటారు.

నాకు జన్మనిచ్చిందెవరో తెలీదు. అమ్మ నాన్న పసిప్రాయంలోనే చనిపోయారట!. పసిగుడ్డుగ పేవ్‌మెంట్ మీద కేరింతలు కొడుతున్న నన్ను దయగల వాళ్లెవరో తీసుకెళ్లి అనాధ శరణాలయంలో చేర్చారట!

శరణాలయం నన్ను అక్కున చేర్చుకుంది! నాకేలోటూ రాకుండా ఆప్యాయంగ చూచుకుంటు ప్రేమాభిమానాలు రంగరించి నన్ను సాకింది. అయిదేళ్లొచ్చాక అక్షరాభ్యాసం అక్కడి మేనేజరే చేసి అదే ప్రాంగణంలో వున్న పాఠశాలకు పలక బలపంతో పంపాడు. ఆయనే నాకు గురువు దైవం అన్నీ!

నాకు నామకరణం కూడా మేనేజరే చేశాడు. శరణాలయమే నాకు దేవాలయం!.

ఆటల్లో... చదువులో నేనే ఫస్ట్ రావటం చూచి మేనేజర్ తెగమురిసేవాడు. ఎత్తుకుని ముద్దాడేవాడు!. నన్ను అభిమానించి అభినందించేవారే!.... అక్కడి పిన్నపెద్ద !

శరణాలయం నడుపుతున్న నాటి నుంచి నావంటి బ్రిలియంట్ స్టూడెంట్ లేదని టీచర్లు... హెడ్మాస్టర్... ఆశ్రమం మేనేజరు పొగడ్తలమీద పొగడ్తలు కురిపించేవారు.

తెలిసీ తెలియని వయసులో నాలో ఏదో పులకింత! పట్టుదల పెరుగుతూ వచ్చింది. నేను గొప్పవాడిని కావాలని నా 'గోల్' రీచ్ అవటానికి విశ్వప్రయత్నం చేస్తూ వచ్చాను.

టెన్త్‌లో 'స్టేట్ ఫస్ట్' వచ్చినందుకు... స్కూలుకు పేరు ప్రతిష్ఠలు తెచ్చినందుకు నన్నందరూ మెచ్చుకున్నారు. స్కూలు చరిత్రలో ఫస్ట్‌క్లాసన్నదే లేదుట!... అలాంటిది నాకు స్టేట్ ఫస్ట్‌రావటంతో నన్ను ఆకాశానికెత్తేశారు.

టెన్త్ పూర్తి అయ్యేవరకూ శరణాలయంలో అందరిపిల్లలకు వున్నట్టే... నాకూ సత్తుకంచం... గ్లాసు వుండేది. స్టేట్ ఫస్ట్ రావటంతో నా స్టేటస్ పెరిగింది. మేనేజరు కొనుక్కొచ్చి నాకు స్టీలు ప్లేటు.. గ్లాసు బహుమతిగా ఇచ్చినందుకు మురిసిపోయాను.

ఎప్పుడూ రెండు మూడేళ్లకోమారు అక్కడి పిల్లలకు గుడ్డలు కుట్టించే యాజమాన్యం... నా ప్రతిభకు ముగ్ధులై నాకు వెంటనే రెండు జతల కొత్తబట్టలు కుట్టించటం 'గ్రేట్' అన్పించింది.

ఇక్కడున్న పిల్లలందరిలో నువ్వే 'సుడిగాడివి'రా అంటూ మేనేజర్ నన్ను ఆత్మీయంగ దగ్గరకు తీసుకున్నాడు. అదృష్టవంతుడినని పొగిడాడు!

మేనేజ్‌మెంట్‌తో పోట్లాడిన మేనేజర్ మంగపతి నన్ను ఇంటర్లో చేర్పించే ఏర్పాటు చేశాడు. శరణాలయం చరిత్రలో టెన్త్‌కి మించి ఎవ్వరినీ చదివించలేదట!.

కానీ ఇంటర్ చదివే అదృష్టం నాకు దక్కింది!. మంగపతిగారికి నేనంటే పంచప్రాణాలు! సొంత బిడ్డలా చూసుకుంటాడు. మార్నింగ్‌వాక్ కెళ్లేటప్పుడు నన్నూ వెంట తీసుకువెళ్లటం అలవాటైంది. ఎన్నో ప్రాపంచిక విషయాలు సమయం దొరికినప్పుడల్లా నూరిపోసేవాడు.

ఆయన రికమెండేషన్ మూలానే నాకు టేకు చెక్కతో తయారైన మంచం... దానిమీద స్పాంజ్ బెడ్.. పిల్లోలతో పాటు బెడ్‌షీట్స్... బ్లాంకెట్స్... కొత్త బకెట్ మగ్గు... నాకోసం ప్రత్యేకించి ఏర్పాటు చేశాడు.

ఆశ్రమంలో నాకు స్పెషల్ ట్రీట్‌మెంటే వుండేది!. ఇదివరకల్లా నన్ను పేరు పెట్టి పిలిచే మేనేజరు... ఇప్పుడు 'సుడిగాడు' అంటూ ముద్దుపేరుతో పిలవటం

చూచి నాలో నేను నవ్వుకుంటూ వుండేవాడిని.

ఏ ధర్మాత్ముడో నన్ను శరణాలయంలో పసికందుగ వున్నప్పుడు చేర్చినా... శరణాలయం నన్ను అక్కున చేర్చుకుంది! నాకు ఇంత తిండి నీడ కల్పించి నన్ను చదివిస్తున్న శరణాలయాన్ని లైఫ్‌లో మర్చిపోలేను.

నాకు చదువు అబ్బటం నా పూర్వజన్మ సుకృతం!- అందరి అభిమానానికి పాత్రుడనయ్యాను. ఇక్కడితో నా ప్రయాణం ఆగిపోకూడదు. ఉన్నత శిఖరాలను చేరుకోవాలి!. నన్ను కన్నవారు బ్రతికువుంటే నా తెలివి తేటలు చూచి ఎంతగా మురిసిపోయేవాళ్లో... వూహకు అందని విషయం!.

ఇంటర్లో నూ స్టేట్ ఫస్ట్ రావటంతో శరణాలయం మేనేజ్‌మెంట్... నన్ను ఎంత వరకైనా చదివించటానికి అంగీకరించిందన్న విషయం మేనేజర్ అంకుల్ చెప్పినప్పుడు నా ఆనందానికి అవధుల్లేకుండా పోయినయ్.

ఎం.సెట్. ఎగ్జామ్ రాసి డాక్టరో... ఇంజనీరో కమ్మని మేనేజర్ ప్రోత్సహించినా... నాకు మాత్రం కలక్టర్ కావాలనేదే లైఫ యాంబిషన్!.

ఆ కారణంగానే బి.ఎస్సీలో జాయినై ఎం.ఎస్సీ చేశాను. శరణాలయంలో వున్నంత కాలం అక్కడి విశాల ప్రాంగణంలో ఎన్నో మొక్కలు నాటాను. వాటికి నీరుపోసి పెంచాను. నేను జిల్లా కలక్టరైతే... వచ్చే శాలరీలో సగం శరణాలయానికి ఇవ్వాలనే డెసిషన్ తీసుకున్నాను.

నన్ను సురేష్ అంటూ ఎవరూ ఆశ్రమంలో పిలిచేవారు కాదు. తోటివారు 'అన్నా' అని... మేనేజర్ గారేమో 'సుడిగాడు' అని పిలవటం అలవాటు.

నాకు ఫ్రెండ్స్ అనే వారెవరూ లేరు. చెడ్డ అలవాట్లు నా దరిదాపులకు రావు!. డిగ్రీ ఫైనలియర్లో మొబైల్ కొనుక్కుని మేనేజర్ అంకుల్‌కు చూపిస్తే ఎంతో సంతోషించాడు. సాధారణంగా నాకొచ్చే స్కాలర్‌షిప్ ఎమౌంటు శరణాలయానికే డొనేషన్‌గ ఇస్తూ వచ్చాను. అట్లా ఇవ్వటం నాకెంతో గ్రేట్ అన్పించేది.

ఐ.ఏ.ఎస్ ప్రిపరేసన్‌కు సిటీలో వున్న సెంట్రల్ లైబ్రెరీకి వెళ్లి కావలసిన బుక్స్

రిఫర్ చేసి నోట్స్ ప్రిపేర్ చేసుకునేవాడిని!

ఒక విధంగా మాతో వుండే మేనేజర్ అంకుల్ కూడా అనాథే! ఆయనకంటూ ఎవ్వరూ లేరు!. పిల్లల్లేకపోవటం... భార్య అనారోగ్య కారణాన మృతి చెందటంతో ఆయనకొచ్చే జీతంలో సగం శరణాలయానికిస్తూ.. రిటైర్ అయిన తర్వాత మేనేజర్‌గ అపాయింటై స్థిరపడ్డాడు.

మంగపతి గారు ఎంతో మంచివారు!. పరుషంగ మాట్లాడని గొప్ప ఆదర్శాలున్న వ్యక్తి! మృదుస్వభావి! శరణాలయం ఆయన సొంత ఇల్లుగా భావిస్తాడు. అక్కడి అనాథ పిల్లలకు సేవచేస్తాడు. చదువు చెప్తాడు. ఆయనకు వచ్చిన సబ్జెక్ట్స్‌లో ఫ్రీగ ట్యూషన్ చెప్తాడు.

రామాయణ భారత భాగవతాలు ఆయనకు కొట్టిన పిండి! పురాణగాథలు పిల్లలకు విన్పిస్తాడు. వల్లెవేయిస్తాడు. నీతిపద్యాలు... శతకాలు చదివించి బట్టీయం వేయించి అప్పగించుకుంటాడు. అనాథ పిల్లలయినా... వారిని భావిభారత పౌరులుగ తీర్చిదిద్దాలని... మంచి అలవాట్లు నేర్పాలనేది మేనేజరుగారి ఆశయం! శరణాలయం నుండి ఒక్క పైసా కూడా వృథా కానీయడు. జీతం లేని వుచిత సేవలు అందిస్తూ జీవిత చరమాంకాన్ని వెళ్లదీస్తున్నాడాయన! ఆయన అనుభవమే పెద్ద గ్రంథాలయం!

XXX

నేను డిగ్రీ ఫైనల్లో వుండగ ఒకనాడు నన్నాయన వెంటతీసుకుని బ్యాంకు తీసుకెళ్లాడు. ఎనభై సంవత్సరాల వయస్సు పైబడినా మంగపతిగారు క్రమం తప్పకుండా రోజూ 'యోగ' చేసేవాడు కాబట్టి మనిషి ఆరోగ్యంగ వుంటాడు. యోగ మనసుకు తనువుకు చాలా మంచిదని ఆయన చెప్పగా విని నేనూ రోజూ అర్థగంటసేపు చేయటం అలవాటు చేసుకోవటం ఆయనకెంతో సంతోషానిచ్చింది.

బ్యాంకు చేరుకోగానే నేరుగ మేనేజర్ కేబిన్‌లోకి ఇద్దరం వెళ్లాం! సాదర ఆహ్వానం పలికిన మేనేజర్‌కు నన్ను పరిచయం చేశారు మంగపతిగారు.

కాస్సేపు ఆమాట ఈమాట మాట్లాడిన తర్వాత బ్యాంకులో తన డిపాజిట్ల విషయం ప్రాస్తవనకు వచ్చింది. ఆ డిపాజిట్లపై నామినేషన్ లోగడ ఎవరి పేరూ

ప్రపోజ్ చేయకపోవటానిన వాటిని నాపేరున నామినేషన్ ఇవ్వాలనుకుంటున్నానంటూ అన్నాడు. మంగపతి గారి మాటలకు నేను విస్తుపోయాను.

'ఈ కుర్రాడు మీ బంధువా?' బ్యాంకు మేనేజర్ నావైపు చూచి మంగపతి గారి నడిగాడు.'

'బంధువు కాదండీ... నా వారసుడు...'

మంగపతి గారిచ్చిన జవాబులోని ఆంతర్యం బోధపడక మేనేజర్ వెర్రిముఖం వేశాడు.

'ఇతను పసితనంలోనే మా శరణాలయానికొచ్చాడు. అన్నీ నేనే అయి పెంచాను. కుర్రాడు బ్రిలియంట్! డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇంకా చదువుకోవాలనే అభిలాష వున్నవాడు!. చదువుల సరస్వతి ! టెన్త్... ఇంటర్లో స్టేట్ ఫస్టొచ్చాడు. నాకు బాగా దగ్గరయ్యాడు. నేను ఏకాకినని మీకు చెప్పానున కదా?- నా తదనంతరం నా డిపాజిట్ ఎమౌంట్స్ ఈ కుర్రాడికే చెందేట్టు నామినేషన్ ఇవ్వాలని వెంటబెట్టుకొచ్చాను. నా డబ్బు కోసం కక్కుర్తి పడే లీగల్ హైర్స్ ఎవరూ లేరు నాకు. రేపు నేను కన్ను మూసినా ఇతనే తలకొరివి పెడతాడు. ఇలాంటి బుద్ధిమంతుడైన కుర్రాడికి ఎంత సాయం చేసినా తక్కువేనని నా అభిప్రాయం!...' చెప్తూ ఆగారు మంగపతిగారు. అర్థమైంది. మీరొక అఫిడవిట్ నోటరీ చేత సంతకం చేయించి దాని నకలు.. అనగా జిరాక్స్ కాపీ నాకివ్వండి! రికార్డులో ఉంచుతాను!

ప్రస్తుతం నామినేషన్ ఫారాలు నింపి ఇవ్వండి. సరిపోతుంది అటెండర్‌ను కేకేసి నామినేషన్ ఫారాలు తెప్పించిన బ్యాంకు మేనేజరు కుర్రాడి పూర్తి వివరాలు పుట్టిన తేది నివాసం ఎట్సెట్రా వివరాలు మంగపతి గారితో ఫారాలు పూర్తిచేయించి తీసుకున్నాడు.

'అఫిడవిట్ మీకు రెండు మూడు రోజుల్లో అందచేస్తాను! మరిక సెలవా...' అనటంతో నేను మంగపతిగారూ ఛేంబర్లోంచి బైటికొచ్చాం.

'మీరు చాలా తొందరపడ్డారు సార్' వెంట నడుస్తూ మంగపతిగారితో అన్నాను

వినమ్రంగా!

'నా ఆలోచన... నిర్ణయం ఎప్పుడూ తప్పుగా వుండవు సురేష్!. నాకెవరున్నారు చెప్పు! నువ్వు నాకు బాగా దగ్గరయ్యావు. నన్ను అభిమానిస్తున్నావ్... గౌరవిస్తున్నావ్! నాకెందుకో బ్యాంకులోవున్న పదిలక్షల డిపాజిట్ నీకు ఇవ్వాలనిపించింది. అందుకే నా వారసుడిగా నిన్ను ప్రకటించాను.'

'ఎవరికెవరు ఈ లోకంలో? మనిద్దరి మధ్య తెలియని ఆత్మీయత... చెప్పలేని అనుబంధం ఏర్పడింది. తండ్రీ బిడ్డలు కూడా మనంత అన్యోన్యంగ వుండరేమో అనిపిస్తుంది నా మనసుకు. నేను నీకు... నువ్వు నాకు... ఒకరికొకరం అండ!- నేనిందాక అన్నట్టు... నేను కన్నుమూస్తే....'

'అలా అనకండిసార్...' కంఠం జీరవోయింది.

'భయపడకు సురేష్! జాతస్య మరణం ధృవం! నాకా వార్ధక్యం మీద పడుతోంది. ఆ దేవుడు ఎప్పుడో అప్పుడు చెప్పకుండా తీసుకెడతాడు!.... నన్ను మాట్లాడనీ... ఆ!... కన్నుమూస్తే నా తలకొరివి నీవే పెట్టాలి బాబూ! అదే నా ఆఖరి కోరిక! నీవంటి యోగ్యుడైన వాడికే నా డబ్బు చెందాలి!...'

'శరణాలయం పేర రాస్తే బాగుండేదనిపించింది...'

'శరణాలయానికి ఉచిత సేవ ఇన్నేళ్లుగ చేసాను... చాలు! అదే నాకు తృప్తి! నువ్వు నామాట... కోరిక... కాదనకు!' వృద్ధిలోకి రావలసిన నీకు డబ్బు ఎంతో అవసరం వుంటుంది!

మంగపతిగారి తదనంతరం ఆయన పదిలక్షలకు నేనే వారసుడిని కావటం అంటే... నేను సుడిగాడినన్న మాటే! ఎవరో నన్ను శరణాలయానికి అప్పగించటం... అక్కడే నామకరణం... విద్యాభ్యాసం... మంగపతి వంటి గొప్ప వ్యక్తి నీడలో... మంచి అలవాట్లతో ఎదిగి ఇంతటివాడిని అవటం... అంతా నా పూర్వజన్మ సకృతమే అనిపించింది!. నన్ను కనిపారేసిన పేరెంట్స్ ఇప్పుడు ఎక్కడున్నారో... ఎలావున్నారో... వారెవరో కూడా తెలయదు. బ్రతికేవుండి ఎక్కడైనా ఒకరికొకరం ఎదురైనా గుర్తుంచుకోలేని దౌర్భాగ్య స్థితి.

అటూ ఇటూ తిరిగి మాట్లాడుకుంటూ లంచ్ సమయానికి ఆశ్రమం చేరుకున్నాం ఇద్దరం!

XXX

నేను నిజంగా సుడిగాడినే!. అదృష్టజాతకుడిని!. నా శ్రమ ఫలించింది. నాకోరిక నెరవేరింది.

ఐ.ఎ.ఎస్. సెలక్షనొచ్చి ట్రైనింగ్ కంప్లీట్ చేసుకున్న నన్ను 'ఎ.పి.' కే ఎలాట్ చేయటంతో డ్యూటీలో చేరబోయే ముందు... నేరుగా మంగపతిగారిని కలవాలనే ఉబలాటంతో శరణాలయానికొచ్చాను.

అక్కడ నేను విన్న విషాద గాథ నన్ను కృంగదీసింది. మంగపతిగారి ఆకస్మిక మరణానికి షాకైనాను. పోయి వారం రోజులే అయిందని తెల్సి... ఆయన కోరిక మేరకు ఆయనకు తలకొరివి పెట్టి సాగనంపలేకపోయానే అని బాధ నన్ను కుదిపేసింది. నాకళ్లు దు:ఖంతో ధారాపాతంగ వర్షించాయి.

వెంటనే బ్యాంకు చేరుకుని నన్ను నామినీగ వుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్స్ ఎమౌంట్స్ క్లెయిమ్ చేసి... దాన్ని తీసుకొచ్చి అనాధశరణాలయానికి డొనేషన్‌గ ఇచ్చేశాను.

పదిలక్షలకు నన్నే కావాలని మంగపతిగారు వారసుడిని చేసినా... వారి ఆఖరి కోర్కె నెరవేర్చలేకపోయిన నేను ఆ పదిలక్షలకు వారసుడిని కాదన్పించింది. అయన సొమ్ము యావత్తు చేరవలసిన చోటికే చేరింది! ఆవిధంగ చేసినందుకు నా మనసు తేలిక పడ్డట్టన్పించింది!.

---సమాప్తం---